# ఏకరువు

అదృష్టవంతుణ్ణని పేరుపడిపోయాను. వాడికేం, అదృష్టవంతుడని ఆనేకులు నన్నుద్దేశించి అనడం పరిపాటి అయిపోయింది. గత పద్నాలుగేళ్ళయి అలాగే అంటున్నారు.

తల్లీ తండ్రీ లేనివాణ్ణి. ఇల్లూ వాకిలీ లేనివాణ్ణి. నీయింటా నీయింటా వారాలు చెప్పుకుని స్కూలుఫైనల్ ఎలాగో గట్టెక్కేను. బతకడానికి, బాగుపడడానికి అది చిన్న సోపానము. అదిగప్పుడూ అంతా అదృష్టవంతుడన్నారు.

పరీక్ష పేసైన కొద్దిరోజులకి నన్ను వెతుక్కుంటూ ఒకాయన వచ్చాడు. ఆ వూరివాడే. నే నెరిగిన ఆసామియే.

"నువ్వు నాతో రావాలి. డాక్టరుగారు నిన్ను నాతో తీసికెళ్ళమన్నారు" అన్నాడు.

ఆయన వెంట వెళ్ళేను. వాళ్ళింట్లో వెధవ్వాళ్ళు, పునిస్త్రీలు, పిల్లా జెల్లా అంతా నన్ను పరీక్షగా చూశారు.

డాక్టరుగారన్నానే ఆయన మా వూళ్ళో మంచి పలుకుబడి ఆ రోజుల్లో ఉన్నవాడు. నేనంటే చాలా అభిమానపడి కాస్త కష్టానికీ, సుఖానికి డబ్బు లేదంటే సదుపాయం చేసేవాడు. పండక్కి బట్టలుకుట్టించి పెట్టేవాడు. బీదవాణ్ణని నలుగురికీ చెప్పి భిక్ష పెట్టించేవాడు.

"ఒరే! నిన్న వాళ్ళింటికి వెళ్ళావుకదా, పిల్ల నచ్చిందా?" అని మర్నాడు డాక్టరుగారడిగేరు. ఆ పెద్దమనిషంటే నన్ను తీసుకెళ్ళాడు కాని, ఆ గొడవంతా నాకేం తెలుసు? పెళ్ళి వ్యవహారంరా ఇదీ అని మాత్రం పసిగట్టేను. పిల్లని వాళ్ళు చూడమనలేదు. నేను చూడలేదు. అంచేత డాక్టరుగారు నన్ను వెంటపెట్టుకువెళ్ళి పిల్లని చూపించమన్నారు.

పిల్లని సావిట్లోకి తీసుకొచ్చారు. పైటపరికిణీ చుట్టబెట్టుకుని పొట్టిగా వుంది. బుర్రొంచుకుందేమో దానిమొహం కనబడలేదు. బుర్ర మాత్రం కనబడ్డాది. అలాటి బుర్రలు ప్రపంచం మొత్తంమీద ఎన్నో ఉండవు. కోలగా కాక గుండ్రంగా కాక పలకలు పలకలుగా ఉంది. చేతులు మాత్రం నిగనిగలాడుతూ కనబడ్డాయి. నల్లగా కనబడ్డాయి. ఇరిడిచేవ రూళ్ళకర్రల్లాగ వ్రేలాడుతున్నాయి.

తిరిగొచ్చాము. డాక్టరుగారు పిల్లనచ్చిందా అన్నారు. నచ్చలేదు. న్యాయంగా ఆ పిల్ల ఏ కుర్రాడికీ నచ్చదనే అనుకుంటాను. నచ్చలేదని చెప్పడానికి సిగ్గుపడి మంటిబుక్కడంలాగ మూతిపెట్టేను. డాక్టరుగారి కన్నీ తెలుసు.

"ఓయ్ వెర్రివాడా, పిల్ల నచ్చడమేమిటి? పెళ్ళి అన్నప్పుడు పిల్ల రూపురేఖలే చూసుకుంటామా? నాలుగూ కలిసి వచ్చినప్పుడు పిల్ల నిజంగా నచ్చదే అనుకో, అయినా నచ్చజెప్పుకోవాలి. అన్నీ కలిసి రమ్మంటే ఎప్పుడూ రావు. లోపాలు ఉంటూనే ఉంటాయి. ఇంతకీ సంసారికి అందమేమిటి? పిల్ల యోగ్యురాలు అవునా కాదా అని చూసుకోవాలి. వాళ్ళది బాగా సాంప్రదాయమైన కుటుంబం. అదొక్కటేచాలు" అని చెప్పేరు. నల్లగా రూళ్ళకర్రలాగ పెళ్ళికూతురి చేతులు నాకళ్ళలో వేళ్ళాడాయి. నాగుండె లెండిపోయాయి. డాక్టరుగారిమాట జవదాటడానికి వీలులేదు. నేనే జవాబూ చెప్పకపోయినా నా అభిప్రాయం నా మొహంలో ఆయనకి కనబడే ఉంటుంది.

"ఓయ్ వెర్రివాడా స్కూలుఫైనలు పేసయావు. ఇహనేం చేద్దామనుకొంటున్నావు?" అనడిగేరు.

"రాజమండ్రి వెళదామని ఉంది."

"కాలేజీలో చదవడానికే?"

"ఊఁ"

"డబ్బు?"

"నలుగురికాళ్ళు పట్టుకుందామని"

"ఎవర్నయినా అక్కడెరుగుదువా?"

"ఎరగను"

"మరి?"

"దేముడులేడా?" నాకు దేముడిమీద పెద్ద విశ్వాసం ఉండేది. దేముడి మహాత్మ్యం తరచు నాకు ప్రత్యక్షంగా కనబడేది. ఒకరింట్లో వారం పోయిందనుకోండి. నాకేం దేముడున్నాడని బయలుదేరేవాణ్ణి. దేముడి మీద భారముంచి అతన్ని సంస్మరిస్తూ వెళ్ళేవాణ్ణి. స్తోత్రం చేసుకోడానికి కొన్ని శ్లోకాలు, పద్యాలు కంఠతా వచ్చేవి. అవి వల్లించుకుంటూ వెళితే వారం టక్కని కుదిరేది. దేముడి మహాత్మ్యం దాఖలా ఇచ్చేది. అంచేతే దేముడులేడా? అని చెప్పాను.

"పెద్ద వూహలతోటే ఉన్నావయితే?" అన్నాడు డాక్టరుగారు. నేనటువంటి ఆశలు కలిగి ఉండటం ఆయనికి ఆశ్చర్యమైంది. నాకంత ఆలోచన ఉండకూడదు. బికారీవాడు బికారీగానే ఉండాలికాని పైకి తలెత్త కూడదు. కమ్మరివాడు కమ్మరిగానూ, కుమ్మరివాడు కుమ్మరిగానూ ఉండి పోవాలి. ఎక్కడి కక్కడ సంతుష్టిపడుతూ ఏదో ఒక విధంగా దినమును వెళ్ళబుచ్చుకోవడమే మనవాళ్ళ ఆశయము.

"అలాగైనా ఈ సంబంధం యోగ్యమైనదే. చక్కగా వెయ్యి రూపాయిలు కట్నమిస్తారుకదా. అదిపెట్టి చదువుకోవచ్చు" అని చెప్పేరు.

నాకు నమ్మశక్యం కాలేదు. నాకేమిటి వెయ్యి రూపాయిల కట్న మేమిటి?

"వెయ్యి రూపాయిల కట్నమే!" అన్నాను.

"చావగొట్టి పుచ్చుకొంటాము"

"ఇవ్వరండీ"

"ఇస్తారనుకో! వొప్పుకుందామా?"

నాకిష్టమయి పోయింది! పట్టున పదిరూపాయిలు చేతితో పట్టుకోని వాడికి వెయ్యి రూపాయిలు ఇస్తామంటే వాడేమౌతాడు?

"ఓయ్ వెర్రివాడా అంతే అనుకొన్నావా? నీకు సైకిలు కొని పిస్తాను. మనతో ఇహ చచ్చేలేదు. వెండిచెంబులు, పట్టుతాపితాలు లాంచ నాలన్నీ జరగవలసిందే. నీకు తల్లీ, తండ్రీ లేనిలోటు లేకుండా నేను చూస్తాను కదూ" అన్నారు.

పెళ్ళికూతురి పలకలబుర్రా, రూళ్ళకర్రలాగ చేతులూ కళ్ళలో మెసులుతున్నా, సంచీ రూపాయలు, సైకిలు అనేసరికి సర్వం మరిచి పోయాను.

ప్రతీమనిషి బతుక్కీ పెళ్ళి అన్నది పెద్ద వ్యవహారం. డబ్బుతో కూడుకున్న వ్యవహారం. నాలాటివాడికి పెళ్ళి కుదరడమే అబ్బురం. కట్నంకూడా వచ్చిందంటే ఏమన్నమాట? కేవలం అదృష్టం కొట్టుకు రావడమే. నా మంచిని మనసారా కోరినవారు కాబట్టి డాక్టరుగారు నాకా చక్కని వ్యవహారం పొత్తుపరిచారు. కేవలం పారమార్థికదృష్టితో చేసిన పనికాని ఇంకోటికాదు.

పెళ్ళయింది. సరికొత్త సైకిలు ముప్ఫయిరూపాయల దైతేనేం కొనుక్కొన్నాను. డబ్బుగల కుర్రాళ్లకే స్వంత సైకిళ్ళు లేవు. అంచేత చాలా జనకంటకంగా ఉండేది.

పెళ్ళయినా నా పెళ్ళాం ముఖారవిందం ఎలాంటిదో నేనెరగను. వివాహ కాలమంతా వాళ్ళోకి వేలేసినతల అదొక్కసారి పైకెత్తలేదు. పెళ్ళయినా నా కళ్ళబడేదికాదు. అథవా పడ్డా ఎగిరి చక్కాపోయేది. అది సిగ్గు సంసారంకాదు.

పెళ్ళితో వారాలబాధ తప్పిపోయింది. ఇల్లరికం అల్లుణ్ణయాను. అక్కణ్ణుంచి మొదలు అంతా నన్ను అదృష్టవంతుడనేవారు. నాలాంటి శుభమైన భర్త దొరికేడు, పిల్ల అదృష్టవంతురాలని ఒక్కరనరే!

ఒకనాడు ఉదయం మొహం కడుక్కొని సావిట్లో కొచ్చాను. మా మామగారు, ఒక ముసలమ్మ మాట్లాడుకొంటున్నారు.

"అబ్బాయి నువ్వు విదియనాడుకదూ పుట్టావు?" అని ముసలమ్మ అడిగింది.

"ఔను" అని చెప్పేను.

"నే చెప్పలేదూ? ఇవాళ వీడి పుట్టినరోజు. మా మనుమడు పంచమినాడు పుట్టేడు. వీడు విదియనాడు పుట్టేడు. ఇదిగో సప్తమినాడు వీడితల్లి చచ్చిపోయింది. పాపం, ఇవాళ పుట్టినరోజు" అన్నది ముసలమ్మ.

"ఆమాట చెప్పొద్దుటోయ్? పెరట్లోకెళ్ళు, మంగలోడున్నాడు తలంటుకొందువుగాని" అన్నారు మామగారు.

"అదృష్టం చూడు. పుట్టినరోజు ఎరుగునా? ఒక పండుగ ఎరుగునా? ఆఁ! చక్కగా అత్తారూ, తలంటి నీళ్ళపోతా అదృష్టములాగుండాలి" అంటూ ఏకరువు పెట్టింది.

నాకొళ్ళు మండుకొస్తుంది. పెళ్ళిదగ్గరనుంచి నిజంగా శని పట్టుకుంది. వారాలు చెప్పుకొన్నా నాకేం? కలిగిన వాళ్ళిళ్ళలో వారాలికి కుదురుకున్నాను. సుష్టుగా షడ్రసోపేతాలతో తినేవాణ్ణి. అత్తవారు అభిమానస్తులే. ఆదరణతో పెట్టిన అంబలి అయినా ఆనందంగానే ఉంటుంది. వాళ్ళకి కలిగింది పెట్టేవారు సంసారులు. వాళ్ళ ఆదరణని కాదన్ను. అందుకు కృతజ్ఞుణ్ణే. కాని జిహ్వాకిమాత్రం శనిపట్టుకొంది.

నాకు పద్దెనిమిదేళ్ళు నిండి పందొమ్మిదోయేడు వచ్చింది. నా పుట్టిన రోజు పిండివంటలు చేశారు. భోజనం చాలా సంతృప్తికరంగా ఉంది. సాయంకాలం సైకిలుమీద షైరు వెళ్ళేను. ఊరవతల నాలుగుమైళ్ళ దూరంలో అతి అందమైన మామిడితోటున్నది. మా వూరికి దగ్గరలో అంత అందమైన తోటున్నదని, సైకిలు చేతికి వొచ్చిన తరువాతే కనిపెట్టేను. తోటచుట్టూ జీడికోరడి ఉన్నది.

రోజూ అక్కడికే వెళ్ళేవాణ్ణి. జూలైలో కాలేజీలు తెరుస్తారు. రాజమండ్రి కాలేజీకి, కాకినాడ కాలేజీకి సీటుకి దరఖాస్తులు పెట్టేను. పెళ్ళి కట్నం బాపతు నాలుగు వందల రూపాయలున్నాయి. అంటే మిగతా డబ్బుతో పెళ్ళాంకి బంగారం కొనిపించేరు. అదికూడా అవసరమైతే వాడీ వొచ్చు. మనోరథ సామ్రాజ్యంలో ఎన్నేనా మేడలు కట్టుకోవచ్చు. జీడి పువ్వులవాసన ఘాటుగా తోటంతా వ్యాపించేది. చీకటిపడేది. చుక్కలు, చంద్రుడు, మామిడి గున్నలు కొత్త అందాలని ధరించేవి. మేడలమీద మేడలు కట్టుకునేవాణ్ణి. చెప్పకేం రంభలాంటి ఇంకో పెళ్ళాన్ని పెళ్ళాడాలని కూడా నిశ్చయించుకునేవాణ్ణి. అసలు మన మనస్సు చెడ్డదికాదు. మొదటి పెళ్ళాన్నికూడా గౌరవంగా ఏలుకుంటాననే అనుకునేవాణ్ణి.

ఒకనాడు మామిడితోటనుంచి చీకటిపడుతుంటే ఇంటికి వొచ్చేశాను. ఇంట్లో సన్నాయి వాగుతున్నది. నేను సావిట్లోకెళ్ళగానే బావలు మరదళ్ళ బట్టల నిండా వసంతం చెంబులతో పోసేశారు. అర్థమైంది నా పెళ్ళాం రజస్వల అయింది.

నా మంచిని కోరే డాక్టరుగారూ, మా మామగారూ పోగై శుభంలో శుభం, ఖర్చులో ఖర్చు, ఆనవాయితీ తీర్చేద్దామన్నారు.

మహాప్రభో పెళ్ళాం రూపుచూశాను. తనివి తీరిపోయింది. ఆ పలకల బుర్రెత్తి చూస్తే పెదమిలమీదకి పొడుచుకొచ్చి అంగుళమేసి పళ్ళున్నాయి. వొళ్ళంతా తారుతేజంతో నిగనిగ లాడుతున్నాది. పొట్టి బుడంకాయ నాలుగడుగులన్నర ఎత్తులేదు.

ఇది నా ప్రారబ్ధ కర్మమూ! మా ఇద్దరికీ ముందుగానే ముడిపెట్టి ఇక్కడ అవతరింపచేశాడా! ఎంతమాత్రం కాదు. దరిద్రుణ్ణి దగాపడి పోయాను.

దానికి పన్నెండేళ్ళని నాతో చెప్పారు. పచ్చబద్ధం. దానికి పదిహేనేళ్ళున్నాయి. మొహం ముదిరిపోయింది. పొట్టిది. కురూపి. ఎవరూ పెళ్ళాడ్డానికి వొప్పుకుని ఉండరు. లోకమంతా విసర్జించి పారేసింది. పెళ్ళికి పూర్వమే పెద్దమనిషై పోయింది. శారదా ఏక్టు అప్పటికి లేదు కదూ, పిల్లి హద్దు తప్పిపోయింది. గడగడలాడిపోయి, కన్నె చెర విడిపించరావలసిన కాలం రాబట్టి నా మెడకి వేళాడగట్టేరు.

యోచనజ్ఞానంలేని కాలం అవడాన్నో, ప్రారంభయౌవన దశ అవడాన్నో చెప్పలేనుకాని ఆ కురూపిని చూసి నేను అసహ్యపడలేదు. నా దురదృష్టానికి నాలో నేను ఏడ్చుకున్నాను. పరాభవాన్నిపొంది, చిన్నబోయేను.

నా శోభనపుగది మరుపుకిరానిది. ఆ డొక్కు టేబులు, దానిమీద పెట్టిన అరిసెల్లు, చక్కిలాలు, మినపసున్ని, ఎరువుతెచ్చి గోడకి వేళాడగట్టిన మచ్చల అద్దం, పెళ్ళాం ముందు పళ్ళ ప్రథమ దర్శనం జన్మకి మరపురావు.

నా పెళ్ళాం నంగనాచికాదు. ఆ పొట్టిదానికి పుట్టెడు బుద్ధులున్నాయి. గడసరి. మాటకారి. అంత సిగ్గు అభినయం చేసేదా? ఎంత చనువు తీసుకొందని? ముసలమ్మలాగా ఎన్ని కబుర్లు చెప్పిందని? ఎంత సరసం వెలగబెట్టిందని? నాకు అరిసెనందించి పరిగ్రహించేదాక ఎంత పట్టుపట్టిందని? బెల్లపు అరిసె పాకాన్నిబడి మిగుల రుచిగా ఉంది. చక్కిలాలు మాత్రం డోకొచ్చాయి. నాకు నేతి మిఠాయిలు ఎలా వస్తాయి?

మామగారు నాకుద్యోగ ప్రయత్నం మొదలెట్టారు. టైపు, షార్టు హేండూ నేర్చుకోమని పురమాయించారు. పెందరాళే ఉద్యోగమైతే కూతుర్ని అల్లుణ్ణి వేరు పెట్టొచ్చని ఆయన బాధ. నాచేత **Your most obedient servant** అని సంతకం చేయించుకుని, పట్టరానివాళ్ళ కాళ్ళన్నీ పట్టుకొంటూ వారం రోజులు కాకిలాగ తిరిగేడు. నా ఉద్యోగం వచ్చి ఏడిసిందా అనుకున్నాను. జీడికోరడివార కూచుని మనోరథ సామ్రాజ్యంలో మేడలు కట్టుకుంటూనే ఉన్నాను. మునిసిపాలిటీలో నా పాలిటికి ముప్పయి రూపాయిల గుమాస్తా ఉద్యోగమైంది. తమకి అతి విధేయుడైన నౌకరునని ఉద్యోగంలో ప్రవేశించాను.

నాకు పెళ్ళి చేయించిన పురోహితుడు నడిరోడ్డుమీద నన్ను నిలబెట్టి:

"ఏమయ్యోయ్! ఉద్యోగమైందా? బహద్దరువి. అదృష్టం అంటే నీది. ఈ రోజుల్లో బ్రాహ్మడికుద్యోగ మవటం మాటలా? పెళ్ళాం కాలు పెట్టిన వేళావిశేషం. అదృష్టం ఆడదానిది. సలక్షణమయినపిల్ల. కొంచెం పొట్టిది. ఐతేనేం నువ్వు చదువుకున్నవాడివి. తెలిసే ఉంటుంది. రంభా తిలోత్తమాది దేవతాస్త్రీ లున్నారే అందులో తిలోత్తమ కుబ్జ. ఫరవాలేదు. శ్రీఘ్రమే సుపుత్రా ప్రాప్తిరస్తు" అని దీవించాడు.

పండువంటి కాపరం, పండువంటి ఉద్యోగం దాపరించేయి. ఇవొదులుకుని చదువు కెళతానంటే ఎవరు హర్షిస్తారు? వారాలు చెప్పుకుంటున్నప్పుడు నాకేమని నిబ్బరం ఉండేది. ఎక్కడలేని ధైర్యం, తెగింపు ఉండేవి. పెళ్ళితో పిరికితనం పట్టుకుంది.

చదువుకొంటే ఏమౌదునో "గ్రే" చెప్పినట్టు "మిల్టను" నే ఔదునో, "క్రామ్వెల్లు" నే ఔదునో. "గ్రే" ఒక ఆంగ్లకవి. మిల్టను పెద్ద ఇంగ్లీషు కవీశ్వరుడు. క్రామ్వెల్లు ఒక ఇంగ్లీషురాజు శిరస్సు ఖండించేసిన ఉద్దండుడు.

ఇదంతా నా లలాట లిఖితమా? నన్ను లోకం దగా చేసిందా లేక నన్ను నేనే దగా చేసుకొన్నానా?

ఇది ప్రారబ్ధకర్మమెంత మాత్రంకాదు. ఖండితముగా కాదని చెపుతున్నాను. సంచీ రూపాయలకి ముప్పయి రూపాయల సైకిల్‌కి నీకు నువ్వే ముప్పుతెచ్చుకున్నావంటారు కాబోలు. వొప్పుకోను. దరిద్రుణ్ణి దగా

పడ్డాను. నా స్థితిలోవున్న ఎవ్వడూ స్థిమితంగా ఆలోచించుకోలేడు. ఇది లోకం చేస్తున్న దగా, మోసం. నాలాంటి అనాధల అభివృద్ధికి లోకం ఏ ఏర్పాట్లు చేసింది? ఏ అవకాశాలున్నాయి?

మనోవాక్కాయ కర్మలా నేను ఏక పత్నీవ్రతస్తుణ్ణి. నమ్మరా? నమ్మండి. నా కెనమండుగురు సంతానం. పేదవాడికి పెళ్ళాడిందే భార్య. దాన్ని భరించడానికే మూడు చెరువుల నీళ్ళు త్రాగుతాడు. పై స్త్రీలని ఎక్కడ భరిస్తాడు. ఆశించలేడు. తలంపులైనా అటు వెళ్ళనియ్యడు. ఉన్న దాంతో సంతుష్టి పడడమే వాడి ఆదర్శం. పెద్ద ఆలోచనలు పెట్టుకొంటే వాడి బతుకంతా దుఃఖ భాజనమై పోతుంది.

నా ఇల్లు, ఆఫీసు, కోమటి కొట్టు, కూరల మార్కెట్టు మినహాయిస్తే నేను ప్రపంచం ఎరగను. ఇప్పుడు యుద్ధమెక్కడ అవుతున్నాదని నన్నడిగితే నాకు తెలియదు. నా జీతం రాళ్ళు నా చేతిలోపడుతూవుంటే ప్రపంచం ఏగంగలో పడితే నాకేం? ఏ గొడవా నాకక్కరలేదు.

సంసారం సాగరంతో సరిపోల్చి దుఃఖ కారణమని పెద్దలు చెపుతారు. సంసారం అందరికీ సాగరం కాదు. కొందరికది చక్కటి సెలయేరు. ఆ సెలయేట్లో పారేది కేవలం చెరుకుపానకమే. నా బోటి గాళ్ళకి సంసారం మహాసాగరం. అహర్నిశలు గగ్గోలు పెట్టె లవణ మహాసాగరం.

ఎందుకు చెప్పుకొచ్చానంటే—ఇవాళ నాకు జీతం ప్రమోషనొచ్చింది. ఒకడు నా బుజం తట్టి అదృష్టవంతుడివి అన్నాడు. దాంతో రిమ్మెత్తుకొచ్చి ఇదంతా ఏకరువు పెట్టుకొచ్చాను. క్షమించండి.